**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, మహాత్మా గాంధీ ఒకప్పుడన్నారు. 'నాకే కనుక మరు జన్మ వుంటే, నేను ఒక మహిళగా పుడ్తాను' అని. నిజానికి నేను ఈ రోజు మాట్లాడేందుకు అవకాశం యివ్వమని కోరింది వేరే అంశం గురించి అయినప్పటికీ, కానీ నన్ను ఒక ఆనరరీ మహిళగా గుర్తించి, మహిళా సభ్యులు గుర్తించి ఇవ్వాళ ఈ అవకాశం యిచ్చారు. అందుకు ధన్యవాదాలు.

**డా॥జయప్రకాష్ నారాయణ :** వారందరికీ అదే అనుమానం వచ్చిందిట. కానీ నేను ఈ రోజు సగర్వంగా నిలబడి మీ అనుమతితో మాట్లాడుతున్నాను. కాబట్టి అధ్యక్షా, నేను మిమ్మల్ని అనుమతి కోరిన అంశం మీద కాకుండా, ఇవ్వాళ చర్చలో వున్న అంశం మీద క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

దాదాపు 215 సంవత్సరాల క్రితం అమెరికాలో రాజ్యాంగం వచ్చాక మహిళల ఓటు హక్కు కోసం పోరాడటం జరిగింది. అంటే 130 సంవత్సరాలపాటు పోరాటం జరిగి, చివరకు 1920వ సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. ఆ రాజ్యాంగం రాస్తున్నప్పుడు అబిగెయిల్ యాడమ్స్ అని, జాన్ యాడమ్స్ గారి భార్య; ఆ దేశంలో రాజ్యాంగ నిర్మాణంలో కీలకమైన వారిలో ఒకరాయన. ఆ దేశానికి రెండవ రాష్ట్రపతి ఆయన.

ఆమె భర్తకు ఉత్తరం రాస్తూ, 'మీరు గొప్ప రాజ్యాంగాన్ని మొట్టమొదటిసారిగా ప్రపంచంలో రాస్తున్నారు. దయచేసి మా మహిళల సంగతి మరచిపోకండి' అని రాసింది. అయినా వాళ్లు మరచిపోయారు. అలాగే, బ్రిటన్‌లో 500 సంవత్సరాల పోరాటంలో 1928 సంవత్సరంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది. అట్లాంటిది మన దేశంలో రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే, కులం, మతం, భాష, ప్రాంతం, లింగ వివక్ష యివన్నీ విస్మరించి వయోజన ఓటు హక్కు యిస్తూ, మహిళలకు ఓటు హక్కు యిచ్చారు. ప్రపంచ రాజ్యాంగాలలో మహిళలకు రాజ్యాంగం వచ్చిన తొలి రోజునే ఓటు హక్కు యిచ్చినటువంటి తొలి రాజ్యాంగం భారత రాజ్యంగం.

ఇన్నేళ్లకు మహిళలకు ప్రాతినిధ్యం కోసం ఏర్పాట్లు చేయాలని పార్లమెంటులో చట్టం కోసం గట్టి పోరాటం జరుగుతోంది. విజయం సాధిస్తారని నాకు విశ్వాసం వుంది. తర్వాత రాష్ట్ర శాసన సభలకు వస్తుంది. మన రాష్ట్ర చట్ట సభలకు వస్తుంది. సగం రాష్ట్రాలకు పైగా దానిని మనం ఆమోదించాలి. ఈ బిల్లు విషయంలో మహిళలకు ప్రాతినిధ్యం ఖచ్చితంగా రావాలని అందరం కోరుకుంటున్నాం. అందరం కోరుకుంటున్నా కూడా ఈ రొటేషన్సు మూలంగా కొంత గందరగోళం వుంటుందని ఆందోళన చాలా మందికి వున్న మాట వాస్తవం. దానికి ప్రత్యామ్నాయాలు కూడా వున్నాయి. 1998 సంవత్సరంలోనే లోక్‌సత్తా తరపున నేనూ, మరి కొందరు మిత్రులు యితర ప్రాంతాల నుంచీ, మంచి ప్రత్యామ్నాయాలను తయారు చేసి యిచ్చాము గాని, ఏవో కారణాల వల్ల వాటిని ముందుకు తీసుకు వెళ్లలేదు. ఒక సామెత వున్నది. The impossible best is the enemy of possible అని. అసాధ్యమైన అద్భుతం, సుసాధ్యమైన మంచికి శతృవు అవుతుంది కాబట్టి, ఏదో ఒక రూపంలో మహిళలకు ప్రాతినిధ్యం యివ్వడం అవసరం. దానిని మనసారా ఆహ్వానిస్తున్నాను.

అయితే, నేను మీ ద్వారా ఈ సభను, అన్ని పార్టీలనూ, ఈ రాష్ట్ర ప్రజలను కోరేది కేవలం మగవాళ్ల స్థానంలో మహిళలు వచ్చేసి రాజకీయాలలో పాత్ర తీసుకుంటే చాలదు.

**శ్రీ ఎన్. జయప్రకాష్ నారాయణ :** కేవలం మగవారి స్థానంలో మహిళలు వచ్చేసి రాజకీయంలో పాత్ర తీసుకుంటే చాలదు. మూడ కారణాలుగా మనం ఈ మార్పు రావాలని కోరుకుంటున్నాము. మొట్టమొదటిది, మహిళలు పెద్దయెత్తున రాజకీయంలోకి ప్రవేశించి రాజకీయ నాయకత్వం తీసుకున్నట్లయితే నేర ప్రవృత్తి, అవినీతి రాజకీయానికి ఈనాడు పర్యాయపదం అయిపోయింది. ఒకరకంగా రాజకీయం అంటే నేర ప్రవృత్తి, అవినీతి అనే భావన ప్రజల హృదయాల్లో బాగా చొరబడిపోయింది. దాని నుండి బయటకు తీయటం కోసమని మహిళలు వస్తే అవకాశం ఉంటుందనే ఆశ మొట్టమొదటిది. రెండవది, సభల లోపలగాని, ప్రభుత్వంలోగాని, రాజకీయంలోగానీ, బహిరంగ చర్చల్లోగాని ప్రమాణాలు బాగుపడతాయి. కేవలం తిట్టుకోవటం,

అరచుకోవటం, గందరగోళంకాకుండా హేతుబద్ధమైన వాదనలతో, వాస్తవాలతో ప్రజా సంక్షేమానికి అనుగుణంగా చర్చలు జరుగుతాయి, ఆరోగ్యకరమైన వాతావరణం వస్తుందన్న ఆశ రెండవది. మూడవది, అధికారానికి అర్థం మారుతుందని. ఈ రోజు అధికారం అంటే పోలీసు అధికారం, అధికారం అంటే భూమి మీద అధికారం. అధికారం అంటే ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్. కాని నిజంగా అధికారం అంటే విద్య అందించటం కావాలి, ఆరోగ్యం అందటం కావాలి, నైపుణ్యం పెరగటం కావాలి, ప్రతి వ్యక్తి ఎదగటం కావాలి. అందుకోసం మహిళల సాధికారత అనేది, నిజంగా సమాజంలో ఈ సాధికారత రూపుదాలుస్తుందని ఆశిస్తూ ఇక్కడున్నటువంటి సభ్యులందరికీ ఈ మహిళా దినోత్సవం నూరవ సందర్భంగా మనసారా అభినందనలు తెలియచేస్తూ ఈ అవకాశం ఇచ్చిన మీకు నమస్కారం తెలియచేస్తూ శెలవుతీసుకుంటున్నాను.